క్లుప్తంగా

అనుమతిలేని బాణసంచా స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న అనుమతిలేని టపాసులు

బనగానపల్లెరూరల్ : పట్టణ పరిధిలోని కొండపేటలో రాజప్రసాద్ ఇంట్లో అనుమతిలేని టపాసులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణయ్య ఆదివారం తెలిపారు. అనుమతిలేని టాపాసులను ఇంట్లో నిల్వ ఉంచుకున్నట్లు సమాచారం రావడంతో వెంటనే వెళ్లి తనిఖీలు చేశామన్నారు. మెగా పవర్ కంపెనీ, శ్రీకృష్ణస్వామి ఫైర్‌వర్క్స్ ఇండస్ట్రీస్, శివకాశీకి చెందిన టపాసుల బాక్స్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

పరామర్శ



రామకృష్ణయ్య కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : మండలంలోని చిన్నరాజుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సి రామకృష్ణయ్య(62) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్‌నాయక్, పాపన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బనగానపల్లె రూరల్ : పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఎనలేనివని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామ పంచాయతీలో విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులకు స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అవసరం మేరకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, సచివాలయ కార్యదర్శులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ



ఆశ్రమంలోని వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాతలు

డోన్ : పట్టణంలోని కొత్తపేటకు చెందిన సాధనగిరి రామిరెడ్డి, రంగమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మండలంలోని ఓబులాపురం వద్ద ఉన్న కాశిరెడ్డినాయన వృద్ధాశ్రమం వృద్ధులకు ఆదివారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు సాధనగిరి ఓబుల్‌రెడ్డి, జయమ్మ, రామక్రిష్ణ, శ్రీకాంత్, ఆశ్రమ నిర్వాహకులు శేగుఎల్లయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

డోన్ మున్సిపల్ కమిషనర్‌గా ప్రసాద్‌గౌడ్



డోన్ : డోన్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జయరాం విశాఖపట్నంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు జిల్లా గూడూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ నియమితులయ్యారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా డాక్టర్ జయరాం తన మాతృ సంస్థ పశు వైద్యశాఖకు బదిలీ అయ్యారు.

నివాళి

డోన్ టౌన్ : డోన్ హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు అవిజ వెంకటేశ్వర్ల మృతికి హోటల్ యజమానులు నివాళులర్పించారు. ఆదివారం సాయిత్రం అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమై వెంకటేశ్వర్ల చిత్ర పటానికి సీనియర్ సభ్యులు గంగన్న చేతుల మీదుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌స్వామి, హరిప్రసాద్, ఉరుకుంద, శ్రీనివాసులు, కాశిం, సుబ్రహ్మణ్యం, ప్రకాష్, మురళీధర్, రాంప్రసాద్ తదితరుల పాల్గొన్నారు.

బాబూ... తీయొద్దు జాబు

- వచ్చే నెల 1నుంచి నూతన మద్యం పాలసీ
- అగమ్యగోచరంగా మద్యం షాపుల ఉద్యోగుల పరిస్థితి

డోన్ రూరల్: నూతన మద్యం పాలసీతో కొందరి ఉద్యోగాలకు ప్రభుత్వం ఎసరు పెట్టింది. అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మద్యం దుకాణాల ఉద్యోగులు ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వం మద్యం దుకాణాల్లో అక్రమాల కట్టడికి, బెల్టుషాపుల నియంత్రణకు ఉద్యోగులను నియమించింది. ప్రభుత్వ సర్వవేక్షణలోనే మద్యం విక్రయాలు నిర్వహించింది. ఈక్రమంలో పలువురు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దక్కాయి. సూపర్‌వైజర్, సేల్స్‌మెన్, నైట్‌వాచ్‌మెన్ తదితరు ఉద్యోగాలను క్రియేట్ చేసి ఒక్కో షాపులో నలుగురు నుంచి ఐదుగురికి ఉద్యోగులు కల్పించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుండటంతో తమ భవిష్యత్ ఏమిటని వారంతా ఆందోళన చెందుతున్నారు.

జగన్ ఉద్యోగాలిస్తే బాబు తీసేస్తున్నారు

2019కి ముందు ఉన్న మద్యం దుకాణాలకు ప్రతి రెండేళ్లకోసారి టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిన దుకాణాలు కేటాయించేవారు. మహిళలు సైతం టెండర్లలో పాల్గొనేవారు. కొన్ని ముఖ్యమైన మద్యం దుకాణాలకు డిమాండ్ ఉండేది. ప్రైవేటు దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ దుకాణాలకు శ్రీకారం చుట్టింది. అవినీతి అక్రమాలకు చెక్‌పెట్టి పలువురు నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. ప్యాపిలి మండలంలో 2, డోన్ 5, బేతంచెర్ల 5 కలిపి నియోజకవర్గ వ్యాప్తంగా 12 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఏపీ రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేందకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్ వెరిఫికెషన్ల ద్వారా నియామాకాలు చేపట్టింది. సూపర్‌వైజర్‌కు నెలకు రూ.21,500, సేల్స్ మెన్లకు రూ.19,500, నైట్ వాచ్‌మెన్లకు రూ.9,500 వేతనంగా అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా రోడ్డున పడనున్నారు.



డోన్‌లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం

ఉద్యోగ భద్రత కల్పించాలి



మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాను. నూతన పాలసీతో నా ఉద్యోగం ఉంటుందో ఊడుతుందోనని ఆందోళనగా ఉంది. వందలాది కుటుంబాలు మద్యం దుకాణాలపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
– శివ, సేల్స్‌మ్యాన్.

ప్రత్యామ్నాయం చూపాలి



ప్రభుత్వ మద్యం పాలసీకి మేం వ్యతిరేకం కాదు. అయితే మా కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రత్యామ్నాయం చూపాలని కోరుతున్నాం. ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
– శ్రీనివాసులు, సూపర్‌వైజర్

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల సంబంధించి విద్యుత్ సరఫరా వేళలను ఆయన వివరించారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరుకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

ఆరోగ్యం ఉంటే అన్నీ ఉన్నట్లే



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : మనిషి ఆరోగ్యంగా ఉంటే అన్నీ ఉన్నట్లే అని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, కర్నూలుకు చెందిన డాక్టర్ రోహిత్ రాఘవేంద్రలు పేర్కొన్నారు. పట్టణానికి చెందిన స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కొత్త బస్టాండ్ వద్ద ఉన్న వైద్య పాలీ క్లీనిక్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఏవైన ఆరోగ్య సమస్యలు ఉంటే నిర్లక్ష్యం తగదని, డాక్టర్లను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో స్ఫూర్తి సభ్యులు మధు, రాము, భాస్కర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సామూహిక లలితా సహస్రనామ పారాయణం



సామూహిక పారాయణంలో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల: లోక కళ్యాణార్థం భగవద్గీత, సామూహిక లలితా సహస్రనామ పారాయణం నిర్వహిస్తున్నట్లు పూదోట ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని పూదోట ఆశ్రమంలో అమ్మవారి ఉత్సవమూర్తులను కొలువుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణం ప్రారంభించారు. ఈనెల 29 వ తేది వరకు కార్యక్రమం కొనసాగుతుందని, ఉదయం 7గంటలకు భగవద్గీత పారాయణం, 8 గంటల నుంచి లలితా సహస్రనామ పారాయణం ప్రారంభమై రాత్రి 8 గంటలకు ముగుస్తుందని వివరించారు.

సద్దలవెంగన్న చెరువుకు వర్షపునీరు



చెరువులో మోస్తారుగా పెరిగిన నీరు

కొలిమిగుండ్ల: అల్పపీడన ప్రభావంతో మోస్తారు మించి వర్షం కురవడంతో కొలిమిగుండ్ల–నాయినపల్లె గ్రామాల మధ్యనున్న సద్దలవెంగన్న చెరువుకు వర్షపునీరు చేరింది. నెలన్నరగా ఆశించిన వర్షపాతం లేక పోవడంతో చెరువులో నీళ్లు అడుగంటాయి. కురిసిన వర్షానికి కొంత మేర వరదనీరు చెరువులోకి చేరాయి. రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం మండలంలో 50.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కొలిమిగుండ్ల, బెలుం, నాయినపల్లె, పెట్నికోట, ఇటిక్యాల తదితర గ్రామాల్లో మంచి వర్షం కురవగా మిగిలిన పల్లెల్లో మోస్తారుకే పరిమితమైంది. వర్షాధారం కింద సాగు చేసిన పంటలకు కురిసిన వర్షం కొంత వరకు ఉపశమనం కలిగించిందని రైతులు తెలిపారు. భారీ వర్షం నమోదు కాకపోవడంతో మండలంలో పలు చెరువులు వెలవెలబోతున్నాయి. బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షం కురిసి భూగర్భ జలాలు పెరగని పక్షంలో వరి, మిరప తదితర పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వాపోయారు.

విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



మృతి చెందిన రైతు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

బనగానపల్లె రూరల్ : మండల పరిధిలోని పలుకూరులో ఈ నెల 19న విద్యుత్ షాక్‌తో మృతి చెందిన అంగజాల ఎల్లాసుబ్బయ్య కుటుంబాన్ని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారాయుడు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వలనే ఎల్లాసుబ్బయ్య పొలంలో విద్యుత్ షాక్ గురై మృతి చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. పొలంలో విద్యుత్ తీగాలు చాలా తక్కువ ఎత్తులో ఉన్నందునే ఈ సంఘటన జరిగిందని, ప్రభుత్వం రూ.20లక్షల పరిహారం రైతు కుటుంబానికి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు బాలశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టపాసులు స్వాధీనం

బేతంచెర్ల: నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన టపాసులను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన కోవెల ప్రణయ్‌కుమార్ అనుమతులు లేకుండా రూ.38 వేల విలువ చేసే టపాసులు, సయ్యద్ నజీర్ అహ్మద్ రూ.12 వేల విలువచేసే టపాసులు నిల్వ ఉంచుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సోదాలు నిర్వహించారు. పేలుడు పదార్థాలైన టపాసులు లభ్యం కావడంతో వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ డీ.వెంకటేశ్వరావు తెలిపారు.

కరాటే పోటీల్లో డోన్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు అందుకున్న విజేతలు

డోన్ టౌన్: కర్నూలు నగరంలోని పుష్పరాజు ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన ఆరవ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో డోన్ రామ్స్ స్కూల్ ఆఫ్ కరాటే విద్యార్థులు ప్రతిభ కనభరచి పథకాలు సాధించారు. కటా విభాగంలో అశ్వద్ బంగారు పథకం, అనికేత్ సిల్వర్, అసిఫా బంగారు, నిఖిల్ సిల్వర్, భానుప్రకాష్ కాంస్యం, చరణ్‌దీప్ బంగారు, సాయికీర్తన సిల్వర్, జాహ్నవి సిల్వర్, తన్విరెడ్డి, సాత్విక్ రెడి, ఆశ్వద్థ్‌లు సిల్వర్, రవళి కాంస్య పథకాలు సాధించగా కుమతి విభాగంలో సాత్విరెడ్డి, భానుప్రకాష్‌లు వెండి, నిఖిల్, చరణ్‌దీప్, తన్విరెడ్డి కాంస్య పథకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ రమణ తెలిపారు. విజేతలను నిర్వాహకులు ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు.

టమాట ధరలు పైపైకి...



కొలిమిగుండ్ల: టమాట ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. వారం క్రితం కిలో టమాట కిలో రూ.30 ఉండగా ఆదివారం ఏకంగా రూ.40 చేరింది. ఆగష్టులో ధరలు భారీగా పడిపోవడంతో టమాట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారం పది రోజుల నుంచి పరిస్థితి మారింది. మార్కెట్లకు టమాట తక్కువ మోతాదులో రావడంతో ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం కోతల్లో ఉన్న టమాటకు మంచి ధర లభిస్తుంది. మదనంతపురంలో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు టమాట సాగు చేశారు. దీంతో వ్యాపారులు ఆ గ్రామానికి క్యూకడుతున్నారు. రోజు రోజుకు కాయగూరలు ధరలు అమాంతం పెరిగిపోతుండటంతో సాధారణ,మధ్య తరగతి కుటుంబాలు ధరలు చూసి బెంబేలెత్తుతున్నారు. వీటికి తోడు వంట నూనెల ధరలు భారీగా పెరగడంతో సామాన్యులకు షాక్ తగులుతుంది.

మద్యం విక్రేత అరెస్టు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని బీరవోలు గ్రామంలో మద్యం విక్రయిస్తున్న చాకలి నడిపి వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. 108 సిబ్బంది సమాచారం మేరకు.. బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్‌కు చెందిన మహమ్మద్ రఫీ, రేష్మా బైక్‌పై వెళ్తున్నారు. పట్టణ శివారులోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఈ ప్రమాదం జరిగింది. రేష్మకు తీవ్ర గాయాలు కాగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణ సబ్ స్టేషన్ టౌన్ 1 ఫీడర్, యు.కొత్తపల్లె సబ్ స్టేషన్‌లోని డిగ్రీ కళాశాల ఫీడర్ కింద మరమత్తుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి ఆదివారం సాయిత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబస్టాండ్, పాతపేట, కొండపేట, చిగురమానుపేట ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయిత్రం 5 గంటల వరకు కరెంటు ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

డోన్: ప్రభుత్వ వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం రోగులు, గర్భిణులు, బాలింతలు, వారి సహాయకులకు ఆదివారం పౌష్టికాహార పంపిణీ చేశారు. కడప జిల్లా కోరుమామిళ్ల తహసీల్దార్ కుమార్తె సోని ఆర్థిక సహాయంతో రోగులకు రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ చేశామని ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ తెలిపారు.

వాల్మీకి బోయ సంఘం పట్టణ అధ్యక్షుడిగా శివ



నియామక పత్రాన్ని అందజేస్తున్న సంఘం రాష్ట్ర నాయకులు

డోన్ : ఏపీ వాల్మీకి బోయ సంఘం డోన్ పట్టణ అధ్యక్షుడిగా కూరగాయల బోయ శివ ఎంపికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు విక్రంనాయుడు, కార్యదర్శి జక్కల శ్రీనివాసులు ఆదివారం నియామకపత్రాన్ని అందజేసినట్లు వాల్మీకి సంఘం నాయకులు తెలిపారు. ఎస్టీ సాధనే ధ్యేయంగా వాల్మీకులందరినీ సంఘటితపరిచి ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు తమ సంఘం అలుపెరుగని పోరాటం చేస్తోందని పట్టణ నూతన అధ్యక్షులు శివ తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి.సుంకయ్య

డోన్ రూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ నియోజకవర్గ సమావేశంలో సుంకయ్య మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 44వ కార్మిక సంక్షేమ చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు. ఏఐటీయూసీ జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23న బ్లాక్‌డే పాటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు పుల్లయ్య, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జులేఖ, ఆటోయూనియన్ నాయకులు అన్వర్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌ల్లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ

బేతంచెర్ల: రౌడీ షీటర్లు అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండి శాంతియుత జీవనం గడపాలని సీఐ డీ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ల్లో మండలంలోని రౌడీ షీటర్లకు, అనుమానితులకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా, అక్రమ మద్యం, పేకాట, మాట్కా నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరమయ జీవితానికి దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

వరద బాధితులకు చేయూత



విజయవాడ వరదబాధిత ఆర్‌ఎంపీ వైద్యులకు కిరాణం కిట్లతో పాటు నగదును అందజేస్తున్న నాయకులు

బనగానపల్లె రూరల్ : విజయవాడలో వరదలతో ఇబ్బందులుపడిన గ్రామీణ వైద్యులకు నంద్యాల జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం, పీఎంపీ అసోసియేషన్, కమ్యూనిటీ పారామెడిక్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రోవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ చేయూతనిచ్చింది. విజయవాడకు చెందిన 160 మంది గ్రామీణ వైద్యులకు కిరాణం సరకుల కిట్లతో పాటు నగదును స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో అందజేసినట్లు మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు సైపుల్లా ఆదివారం తెలిపారు. నంద్యాల తరుపున సుమారు రూ.3.20లక్షల విలువ కిరాణం సరకులతో పాటు రూ.3.20లక్షలను వరదబాధిత గ్రామీణ వైద్యులకు అందజేశామన సైపుల్లా తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వీబీటి రాజు, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రాజు, అధ్యక్షుడు రొక్కం నాగేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి బళ్లా శ్రీనివాసులు, నంద్యాల జిల్లా కార్యదర్శి సురేష్ బాబు తదతరులు పాల్గొన్నారు.

డోన్ : విజయవాడ వరదల్లో సర్వం కోల్పోయిన గ్రామీణ వైద్యులకు ఏపీ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఫెడరేషన్ ఆఫ్ పారామెడికల్ అసోసియేషన్ సంయుక్తంగా చేయూతనిచ్చాయి. వివరాలను గ్రామీణ వైద్యుల సంఘం నంద్యాల జిల్లా డోన్ ప్రాంత అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలియజేశారు. ప్రైవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ పారామెడికల్ ప్రైమరీ హెల్త్‌కేర్ సంస్థల సహకారంతో విజయవాడలోని గ్రామీణ వైద్యుల కోసం రూ.3.20లక్షల నిత్యావసర సరుకులు, రూ.3.20 లక్షల నగదును సేకరించి రాష్ట్ర కార్యాలయంలో అందజేశామన్నారు. ఆదివారం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో వరదల్లో నష్టపోయిన గ్రామీణ వైద్యుల కుటుంబాలకు ఈ సహాయం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ వ్యవస్థాపకులు రాజు, కార్యదర్శి బల్లా శ్రీనివాసరావు, కోశాధికారి క్రిష్ణమూర్తి, పీఎన్‌పీల రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్‌రావ్, ఆర్‌ఎంపీల రాష్ట్ర కోశాధికారి రొక్కం నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారని చెప్పారు.

ఐకమత్యం చాటుకోవాలి

డోన్ టౌన్ : రెడ్డి సామాజిక వర్గీయులు ఐకమత్యం చాటుకోవాలని, కష్టాలలో ఉన్నవారికి అండగా నిలువాలని రెడ్ల సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని నందురెడ్డి ఇంటిలో నాయకులు సమావేశమై కార్తీకమాస వన భోజనం ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీకమాసంలో జరిగే వన భోజనాల కార్యక్రమానికి ప్రతి ఒక్కరు కుటంబ సభ్యులతో హాజరుకావాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు కుటుంబ సభ్యులతో హాజరైతే సభ్యత, స్నేహ బాంధవ్యాలు మెరుగుపడుతాయన్నారు. కార్తీక వన భోజన మహోత్సవాలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. త్వరలో వన భోజనాలు నిర్వహించుకునే తేదీ, స్థలం తెలియజేస్తామన్నారు. సమావేశంలో రెడ్ల సంఘం నాయకులు హేమసుందర్‌రెడ్డి, నందు రెడ్డి, ఆర్టీసీ కృష్ణారెడ్డి, రామేశ్వరరెడ్డి, చంద్రహాసరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దారా ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ సభ్యులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్న అనాథ వ్యక్తి వెంకట గోపాల ఆచారి (70) కొంత కాలంగా అస్తమా వ్యాధితో బాధపడుతూ మరణించాడు. మృతునికి ఎవ్వరు లేకపోవడంతో గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించాలని ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వన్నూర్ బాషాను కోరారు. వన్నూర్ బాషా తన సంస్థ సభ్యులతో గ్రామానికి వెళ్లి వెంకట గోపాల ఆచారి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు లక్ష్మీరాఘవ, అక్బర్, వెంకటేశ్వర్లు, గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల జయప్రకాశ్ రెడ్డి

ప్యాపిలి: ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొమ్మేమర్రిలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేదిశగగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోరు బావుల్లో నీటి పెరుగుదలకు కృషి



పంట పొలాల్లోని బోర్లను పరిశీలిస్తున్న ప్రతినిధుల బృందం

డోన్ టౌన్: నీటి లభ్యత తక్కువగా ఉండి తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరు బావుల్లో నీరు ఇంకిపోయిన బోరు బావులను రోబోటిక్ టెక్నాలజీతో రీచార్జ్ చేసి తిరిగి ఉపయోగంలోకి తీసువచ్చేందుకు పరిశీలనలు చేస్తున్నట్లు వీల్స్ గ్లోబల్ ఫౌండేషన్ కమ్యూనికేషన్ మేనేజర్ ముంబయికి చెందిన దీపిక చోప్రా, సంస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) జేవీఏ కృష్ణమూర్తి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా డోన్ నియోజకవర్గంలో చేపట్టేందుకు రూరల్ స్టడీస్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గతంలో రీచార్జ్ చేసిన బోర్ల పనితీరును వారు ఆదివారం పరిశీలించారు. మండలంలోని గుమ్మకొండ, వెంకటాపురం, బొంతిరాళ్ల, బేతంచెర్ల మండలంలోని ముద్దవరం, పి.రుద్రవరం, పెండేకల్లు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన బోరు రీచార్జ్ పాయింట్లను పరిశీలిస్తూ రైతుల జీవన స్థితిగతులు, జీవన ప్రమాణాలను, సాగు చేసే పంటల వివరాలు అవసరమయ్యే నీటి వినయోగం తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌డీఎస్ అధ్యక్షులు విజయ్, ఏరియా కోఆర్డినేటర్ సునీల్‌తో పాటు ఆయా గ్రామల రైతులు పాల్గొన్నారు.